



అమలాపురంలో వాన

వర్షపాతం వివరాలు

అమలాపురం టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మండలాల్లో సగటున 24.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మలికిపురంలో 57.6, అత్యల్పంగా కపిలేశ్వరపురంలో 6.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆత్రేయపురం మండలంలో 7.8, మండపేట 18, రాయవరం 18.2, రామచంద్రపురం 17, ఆలమూరు 13, రావులపాలెం 7.8, కొత్తపేట 16.2, కపిలేశ్వరపురం 6.8, కె.గంగవరం 18.2, ఐ.పోలవరం 39.2, ముమ్మిడివరం 20.6, అయినవిల్లి 19.6, పి.గన్నవరం 22.4, అంబాజీపేట 25.2, మామిడికుదురు 19, రాజోలు 34.6, సఖినేటిపల్లి 56, అల్లవరం 22.6, ఉప్పలగుప్తం 34.4, కాట్రేనికోన 30.2, అమలాపురం మండలంలో 38.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



వెంకన్న నిజరూప దర్శనం

బ్రహ్మోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు

ఆత్రేయపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవ పనులకు చురుగ్గా ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. గురువారం స్వామివారి తిరుమంజన సేవ నిర్వహించారు. భక్తులకు స్వామివారు నిజరూప దర్శనం అందించారు. ఈ నెల 21 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న యాగశాల పనులను ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు పరిశీలించారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు ఆహ్వాన పత్రాలను అందజేసే పనిలో నిమగ్నమయ్యారు. గురువారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒకరోజు ఆదాయం రూ.1,73,192 లభించినట్టు ఉప కమిషనర్ తెలిపారు.



ఓడలరేవు సముద్ర తీరంలో కొట్టుకుపోయిన ఓఎన్జీసీ రివిట్‌మెంట్ రోడ్డు

దెబ్బతిన్న జియో ట్యూబ్ రాళ్ల కట్టుబడి

కడలి కల్లోలం

రాకాసి అలలు తీరం వెంబడి అలజడి సృష్టిస్తున్నాయి.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు తీరంలో ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.. ఒక్కసారిగా అలలు బీభత్సం సృష్టించడంతో జియో ట్యూబ్ రాళ్ల కట్టుబడి దెబ్బతింది. ఓఎన్జీజీ రివిట్ మెంట్ రోడ్డు కొట్టుకుపోయింది. ఓఎన్జీసీ ప్లాంటుకు సరైన రక్షణ లేక అలలతో ముప్పు వాటిల్లింది. ముందస్తుగా ఓడలరేవు, కొమరగిరిపట్నం తీర గ్రామాలకు ప్రమాద ఘంటికలు హెచ్చరిస్తున్నాయి. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఓడలరేవు, కొమరగిరి తీరంలో రక్షణ చర్యలు చేపట్టలేదని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వాధికారులు, ప్రజాప్రతినిధులు, ఓఎన్జీసీ ఉన్నతాధికారుల బృందం భయానకంగా తయారైన తీరంలో దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

- అల్లవరం(ఆంధ్రజ్యోతి)

ఓఎన్జీసీ ప్లాంటుకు ముప్పు
ఓడలరేవు తీరంలో
ప్రమాద ఘంటికలు
తుఫాను ప్రభావంతో
రాకాసి అలల బీభత్సం
తీరప్రాంత రక్షణను పట్టించుకోని
ఓఎన్జీసీ, అధికార యంత్రాంగం
స్థానికుల్లో భయాందోళన
ధ్వంసమవుతున్న రోడ్లు
ఆక్వా చెరువులకు గండ్లు

తీర గ్రామాలకు ముప్పు

పట్టించుకునేవారేరి..?

సిస్మిక్ సర్వేలు, ఆన్‌షోర్, ఆఫ్‌షోర్ ఓఎన్జీసీ బావుల ద్వారా ముడిచమురు గ్యాస్ అపారంగా తీసివేయడంతో తీరంలో రెండు అడుగుల మేర భూమి కుంగిపోయి సుమారు కిలోమీటరు లోపలకు గడిచిన 20 ఏళ్లలో భూమి కొట్టుకుపోయి తీరంలో అలలు విరుచుకుపడుతున్నాయి.

ఓఎన్జీసీ ప్లాంటుకు ముప్పు

కృష్ణా గోదావరి బేసిన్ పరిధిలో వేలాది కోట్లతో నిర్మించిన ఓఎన్జీసీ ప్లాంటుకు సముద్ర అలలతో ముప్పు వాటిల్లింది. ప్లాంటులోకి సముద్రపు చొచ్చుకు వచ్చి అలలు బీభత్సం సృష్టించాయి. ఓడలరేవు బీచ్ రోడ్లు పూర్తిగా కొట్టుకుపోయాయి. రూ.12 కోట్లతో నిర్మించిన డ్రైనేజీ సిస్టం పూర్తిగా ధ్వంసమైంది. ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధులతో తీరం వెంబడి పటిష్ట రక్షణ చర్యలు చేపట్టకుండా ఓఎన్జీసీ అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు ఉన్నాయి. తీరంలో వెయ్యి ఎకరాల రైతు జిరాయితీ భూములు, 150 ఎకరాల అటవీశాఖ భూములు సముద్ర గర్భంలో కలిసిపోయాయి. ఓడలరేవు గ్రామంలో కొందరు దళారీలు స్వలాభాపేక్షతో గ్రామాభివృద్ధిని పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఓఎన్జీసీ ప్రహరీ వెనుక సముద్ర కోత నుంచి రక్షణగా నిర్మించిన జియో ట్యూబ్ రాళ్ల కట్టడాలు కొట్టుకుపోయి ఆ ప్రాంతం భయానక పరిస్థితిని తలపిస్తుంది.

రొయ్యల చెరువులకు గండ్లు

ఓడలరేవు తీరంలో సుమారు వంద ఎకరాల్లో రొయ్యల చెరువులకు గండ్లు పడి రొయ్య పంట కొట్టుకుపోయింది. ఓఎన్జీసీ గేటు వద్ద చిరు వ్యాపారి బంగారమ్మ బడ్డీ అలల తాకిడికి కొట్టుకుపోయింది. సముద్ర తీరంలో ఆక్వా చెరువులతో పాటు ఇసుక తవ్వకాల వల్ల పెనుముప్పు వాటిల్లింది. 'గట్టు జారితే ఊరు గల్లంతే, ఓడలరేవు తీరంలో భారీగా భూమికోత, సముద్రపు అలలకు కొట్టుకుపోయిన రోడ్డు' వంటి శీర్షికల్లో ఆంధ్రజ్యోతిలో పలు కథనాలు వెలువడిన సంగతి విదితమే. ఇప్పటికైనా తీర గ్రామాలు, ఓఎన్జీసీ ప్లాంటు ఉనికి కోల్పోకుండా యుద్ధ ప్రాతిపదికన తీర ప్రాంతంలో పటిష్ట రక్షణ చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు తీర గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఓఎన్జీసీ నిధులతో తీరం వెంబడి రక్షణ గోడ నిర్మించేలా చర్యలు చేపట్టాలని ఎంపీ జి.హరీష్‌మాధుర్‌కు, ఎమ్మెల్యే ఆనందరావుకు జిల్లా కలెక్టర్, ఓఎన్జీసీ ఉన్నతాధికారులకు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.





రొయ్యల చెరువులకు పడ్డ గండ్లు



అంతర్వేది: బీచ్‌లో షాపుల వద్దకు సముద్ర ప్రవాహం

చొచ్చుకొచ్చిన కెరటాలు

అంతర్వేది, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం అంతర్వేది తీరం వెంబడి సముద్ర తీరం వెంబడి ముందుకు చొచ్చుకువచ్చాయి. అంతర్వేది బీచ్‌లో కెరటాల తాకిడికి కోతకు గురైంది. బీచ్‌లో ఉన్న షాపుల ముందు నుంచి రోడ్డు మార్గాన కెరటాల పోటు సముద్రపు పోటు నీరు ముందుకు వచ్చింది. పౌర్ణమి, అమావాస్యలకు సముద్రం, గోదావరి నీరు ముందుకు రావడం సర్వసాధారణం అని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ పోటునీరు వల్ల కొబ్బరి చెట్లు, సరుగుడు తోటలు కోతకు గురవుతున్నాయి. అంతర్వేది లైట్ హౌస్ నుంచి కరవాక వరకు ఉధృతంగా పౌర్ణమి కావడంతో సముద్రపు కెరటాలు ముందుకు వచ్చి ఉప్పునీరు పల్లపు ప్రాంతాల్లోకి చేరుతుంది.

టేస్ట్..టేస్ట్‌గా

బొంగు చికెన్



రావులపాలెం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మాంసాహార ప్రియులు కొత్త రుచుల కోసం వెతుకులాడడం. ఆ రుచిని



ఆస్వాదించేందుకు ఎంత దూరమైనా వెళ్లడం ఇప్పుడు మామూలైపోయింది. ఒకప్పుడు బొంగు చికెన్ తినాలంటే అరకు, విశాఖపట్నం, మారేడుమిల్లి వంటి టూరిస్టు ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. బొంగులో తయారు చేసే ఈ చికెన్‌కు ఎంత క్రేజ్ ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. దీంతో చాలా ప్రాంతాల్లో బొంగు చికెన్ అవుట్‌లెట్లు పెట్టి అమ్మేస్తున్నారు. అమలాపురానికి చెందిన ఓ యువకుడు రావులపాలెంలోని హాస్పిటల్స్ సెంటర్ సమీపంలో ఒక చిన్న దుకాణం ప్రారంభించాడు. రోజూ ప్రారంభంలో పది నుంచి 20 బొంగులు అమ్మేవాడినని, ప్రస్తుతం 40 నుంచి 60 వరకు అమ్ముడవుతున్నాయని అతను తెలిపాడు. వీటి ధర ఆఫ్ అయితే రూ.200, ఫుల్ అయితే రూ.300 ఉంది. ధర కొంచెం ఎక్కువైనా వెరైటీ టేస్ట్ కాబట్టి మాంసాహార ప్రియులు ఆరగిస్తున్నారు. ఇలా కోనసీమ వ్యాప్తంగా పలు చోట్ల బొంగు చికెన్ దుకాణాలు తెరిచే పనిలో కొందరు యువకులు ఉన్నారు.

ప్రమాదభరితంగా..

వంతెన రెయిలింగ్



రావులపాలెం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నిత్యం విద్యార్థులు, రైతులు, ప్రజలు రాకపోకలు సాగించే వంతెన ప్రమాద భరితంగా ఉండడంతో ఎప్పుడు ఎవరికి ఏ ప్రమాదం జరుగుతుందోనని హడలిపోతున్నారు. రావులపాలెం మండలం కొమరాజులంక గ్రామంలోకి వెళ్లేందుకు కాల్వపై నిర్మించిన వంతెన రెయిలింగ్ ప్రమాదభరితంగా ఉంది. రెయిలింగ్‌కు ఏర్పాటు చేసిన గొట్టాలు విరిగిపోవడంతో వాటి స్థానంలో వెదురు గెడలతో రక్షణ కల్పించారు. అయితే వంతెన దిగే సమయంలో ద్విచక్ర వాహనాల వేగానికి అదుపు తప్పితే రెయిలింగ్ మీద నుంచి రహదారిపైకి పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. రెయిలింగ్ ఆధునికీకరణకు చర్యలు చేపట్టి ప్రమాదాలు జరగకుండాముందస్తు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కలిసే వెళ్లిపోయారు..

హైదరాబాదులో ఓ కంపెనీలో ప్రమాదం
దొంతికుర్రు గ్రామానికి చెందిన కవలలు మృతి

7లో

వాల్మీకి మహర్షి ఆదర్శప్రాయుడు

కలెక్టర్ మహేష్‌కుమార్

కలెక్టరేట్‌లో ఘనంగా జయంతి వేడుకలు

అమలాపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మానవుని ధార్మిక జీవన విధానం ఎలా ఉండాలో తెల్పి చెప్పిన మహాకవి వాల్మీకి మహర్షి అని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ చెప్పారు. భారతీయ సాహిత్యానికి దారి చూపిన మహనీయునిగా వాల్మీకి నిలిచారన్నారు. యుగాలు మారినా రామాయణం ద్వారా శ్రీరాముడు అందించిన ధర్మం మాత్రం కొనసాగుతూనే ఉంటుందన్నారు. వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్‌తో పాటు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాలధర్మాలు మారుతున్నా, జీవనవేగం పెరుగుతున్నప్పటికీ వాల్మీకి రామాయణం దారి చూపుతూనే ఉందన్నారు. కవులకు మూల కవిగా నిలిచిన వాల్మీకి మహర్షి ఆశయాలు, ఆలోచనాలు త్రికరణ శుద్ధిగా ఆచరించడమే ఆయనకు అర్పించే ఘనమైన నివాళి అన్నారు. నారద మహర్షి వల్ల చెడు వ్యసనాల నుంచి పరివర్తన చెందిన వాల్మీకి రామాయణాన్ని రచించారన్నారు. ఆడిన మాట తప్పకుండా ఉండడం, స్నేహం విలువలు తెలుసుకోవడం, ధర్మ నిష్ఠలో మంచి వైపు నిలబడడం వంటి ఎన్నో అంశాలను రామాయణం ద్వారా మానవాళికి అందించారన్నారు. గిరిజనులంతా వాల్మీకిని ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగు జాడల్లో పయనించాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దారి దోపిడీలు చేసే వాల్మీకి మహర్షిగా ఎదిగిన విధానాన్ని వివరించారు. జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ టీవీ ప్రసాద్ మాట్లాడుతూ రామాయణం కుటుంబ వ్యవస్థ విశిష్టతను చాటి చెబుతుందన్నారు. రామాయణంలోని పాత్రలన్నీ నిత్యం జీవితంలో ఎక్కడో ఒకచోట దర్శనమిస్తూనే ఉంటాయన్నారు. ఎటువంటి చదువులు చదవని వాల్మీకి జ్ఞానోదయంతో 24 వేల శ్లోకాలతో రామాయణాన్ని రచించారని వివరించారు. తాళ్లరేవుకు చెందిన విద్యార్థి శీలం శ్రీను వాల్మీకి వేషధారణతో అందరినీ ఆకట్టుకోగా కలెక్టర్ మహేష్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి కె.కాశీవిశ్వేశ్వరరావు, వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్, సహాయ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ దొర, వసతిగృహ సంక్షేమ అధికారులు సీహెచ్ రాధాకృష్ణ, విజయ్, సాయిరామ్‌జానకీ, అనురాధ, కామేశ్వరి, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



వాల్మీకి మహర్షికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్



వాల్మీకి వేషధారణలో విద్యార్థి

కొత్త కొత్తగా..

స్పెషల్ లుక్‌తో పెళ్లి ఊరేగింపు



నూతన జంట

అల్లవరం అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అల్లవరం మండలం బెండమూర్లంకలో మోటమర్రి వారి కొత్త పెళ్లి జంట ఊరేగింపు సందడిగా సాగింది. మోడ్రన్ లుక్‌తో పెండ్లి కూతరు, పెండ్లి కొడుకు సందడి చేయడం ఏ పెళ్లిలో అయినా మామూలే.. కానీ ఇక్కడ బంధువులు, స్నేహితులు కూడా మోడ్రన్ లుక్‌తో కనిపించడం విశేషం కొత్తజంట చంద్రమౌళి-మాళవిక ప్రత్యేక వాహనంలో కేరళ డప్పులకు నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు. పెళ్లిజంట ప్రత్యేక వాహనానికి ముందుగా పట్టుచీరలు, వడ్డానాలు, రాజా తలపాగాలు పెట్టుకుని, షూలు కళ్లజోళ్లతో నలుగురు యువతులు బుల్లెట్లు నడుపుతూ హైలెట్‌గా నిలిచారు.

చూసొద్దాం రండి భేతాళ ఉత్సవం



నేడు అంబాజీపేటలో తీర్థం
ఉత్సవానికి ఘనంగా ఏర్పాట్లు
కొలువుదీరనున్న వాహనాలు



కృష్ణ



ఆంజనేయ వాహనాలు

అంబాజీపేట , అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నాలుగు దశాబ్దాలకు పైగా చరిత్ర కలిగిన విజయభేతాళ స్వామి ఉత్సవాన్ని అంబాజీపేటలో అభ్యుదయ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు భేతాళుని పూజించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. ఈ ఉత్సవంలో 13 వాహనాలు కొలువుతీరనున్నాయి. ఉత్సవాలలో భాగంగా కలశ స్థాపనతో ప్రారంభమైన ఈ కార్యక్రమం 10 రోజుల పాటు కొనసాగుతూ అమ్మవారితో పాటు భేతాళునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ వాహనాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి దైవరూపాలను పురవీధులలో ఊరేగించుకొంటూ అంబాజీపేట సెంటర్‌కు చేరుకొంటారు. చెడీతాలింఖానా, కర్రసాము, అగ్గిబరాటాలతో యువకులు చేసే విన్యాసాలు చూపరులను గగుర్పాటుకు గురిచేస్తాయి.



చెడీతాలింఖానా విన్యాసాలు(ఫైల్)

కొలువుదీరనున్న వాహనాలు

శ్రీనివాసనగర్, పెచ్చెట్టివారి పాలెం నుంచి గరుత్మంతుడు, మాచవరం శ్రీరామనగర్ నుంచి శ్రీదుర్గమ్మవారు, దొమ్మేటివారిపాలెం (పాతపోస్టాఫీస్) శ్రీకృష్ణుడు, స్త్రీల ఆస్పత్రి వద్ద దొమ్మేటివారిపాలెం, పోతాయిలంక నుంచి ఆంజనేయస్వామి, గంగలకుర్రు మలుపు నుంచి విజయగణపతి, మాచవరం ఇటీకాలమ్మ గుడి, కొత్తపాలెం నుంచి హంస వాహనం, చప్పిడి వారిపాలెం నుంచి షిర్డీసాయిబాబా, గుత్తుల వారి పాలెం నుంచి సింహం, నందంపూడి నుంచి రాజరాజేశ్వరిదేవి, శ్రీనివాసనగర్ నుంచి ఏనుగు వాహనాలు కొలువుతీరతాయి.



ఆ ఊరంతా.. నిక్‌నేమ్‌లే!

ఒరే కలెక్టర్ ఎక్కడ..
జేడీ ఇంట్లోనే ఉన్నాడా..
సంతలో ఎంపీ కనిపించాడ్రా,
మన ఎనకే సైకిలేసుకుని వచ్చేత్తాన్నాడు..
వీళ్లందరూ సరే, నేపాల్ ఎక్కడ..
బాబూమోహన్ ఇంటి దగ్గర వాజ్‌పేయి,
జమదగ్ని బాతాఖానీ పెట్టారు..
మరి రొట్టు, చట్నీ సంగతేంటి..
ఏంటీ వీళ్లందరూ అక్కడుండటమేంటీ,
ఇంతకూ ఏంటి కథా అనేకదా మీ
గందరగోళం. అదేం లేదు, ఇవన్నీ
ఒకే ఊరిలో కొందరికి ఉన్న నిక్‌నేమ్‌లు.
ఇలా మారుపేర్లతో ఈ ఊర్లో వారంతా
పిలుచుకోవడం ఎన్నో ఏళ్లుగా ఉందట.
ఆ ఊరేంటి.. ఆ కథేంటంటే..

- అసలు పేర్లు మరుగు.. మారుపేర్లతోనే పిలుపు
- బోడపాటివారి పాలెంలో సంథింగ్ స్పెషల్

ఆ గ్రామంలో అసలు పేర్లు మరుగున పడిపోయి.. మారుపేర్లు మాత్రం చలామణీ అయిపోతున్నాయి. ఆ ఊళ్లో అడ్రస్ కావాలంటే అసలు పేరు పట్టుకుని వెళితే ఇబ్బందులు పడవల్సిందే. మారుపేరు (నిక్‌నేమ్) తెలుసుకుంటేనే సంబంధిత వ్యక్తుల అడ్రస్ దొరుకుతుంది. ఆ... విచిత్ర నిక్‌నేమ్‌ల గ్రామం ఎక్కడో కాదండోయ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలంలో ఉన్న బోడపాటివారి పాలెం. ఒక వ్యక్తి వ్యవహార శైలి, తీరుతెన్నులను బట్టి ఊళ్లో ఎవరో ఒకరు ఓ పెట్టుడు పేరు తగిలించేస్తారు. తర్వాత అదే అసలు పేరు అన్నట్టు చలామణీలోకి వచ్చేస్తుంది. కొన్ని పేర్లను పరిశీలిస్తే సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ(జేడీ), యడ్లపల్లి శ్రీనివాసరావు (బాబుమోహన్), మేడిచర్ల ప్రసాద్ (ఎంపీ), బండి వెంకటేశ్వరావు (కలెక్టర్), నల్లా రామకృష్ణారావు (రెడ్డినాయుడు), పడాల వెంకటేశ్వరావు (సూపర్), యడ్లపల్లి నారాయణమూర్తి (ఉషశ్రీ), యడ్లపల్లి శ్రీను(గ్రీకు), మానేపల్లి వెంట్రాజు(పిలక), అడబాల శ్రీనివాసరావు (పెద్దోడు), బోడపాటి వీరస్వామి(బాషా), నల్లా దుర్గారావు (గంగోలి), తోట శ్రీనివాసరావు(చలం), బోడపాటి వెంకటేశ్వరావు(గఫూర్), కుంపట్ల నరసింహరావు (సంప్రదాయం), బోడపాటి రామకృష్ణ(జమదగ్ని), నల్లా దుర్గా నరసింహరావు(చట్నీ), అడబాల దుర్గారావు(రొట్టు), చినిమిల్లి సతీష్ (వాజ్‌పేయి), పోలిశెట్టి గణపతి (నేపాల్) ఇలా.. ఆ గ్రామంలో చాలామందికి ఇలా నిక్‌నేమ్‌లతో పాపులర్. ఆవిధంగా పిలిస్తేనే వారి చిరునామా తెలిసేది. ఏమిటీ మారుపేర్ల కథ.. అని గ్రామస్తులను అడిగితే ఆసక్తికరమైన కథలూ తెలిశాయి. బండి వెంకటేశ్వరావుకు కలెక్టర్ పేరు ఎలా వచ్చిందంటే ప్రతి విషయానికి నియమ నిబంధనలు చెప్తూ అజమాయిషీ చేయడంతో ఆయనకు ఆ పేరు వాడుకలోకి వచ్చింది. అలాగే యడ్లపల్లి నారాయణ మూర్తికి ఉషశ్రీ పేరు ఎలా వచ్చిందంటే..

ఆకాశవాణిలో పురాణపండ సూర్యప్రకాశ దీక్షితులు (ఉషశ్రీ) నాటికలు, పురాణాలు గురించి అర్థమయ్యే రీతిలో ప్రేక్షకులకు వినిపించేవారట. అదే తరహాలో ఈయన మాట్లాడడంతో అప్పట్లో ఆ పేరు వచ్చింది. దుర్గానరసింహరావు, దుర్గారావు చిన్నతనం నుంచి మంచి స్నేహితులు కావడంతో రొట్టె, చట్నీగా కలిసి ఉంటారని ఒకరికి రొట్టె, మరొకరికి చట్నీగా నామకరణం చేశారు. ఇలా ప్రతి ఒక్కరి మారుపేరులో ఒక కథ ఉంది. అయితే మారుతున్నకాలంతోపాటు అధికంగా విద్యావంతులు కావడంతో ఆ తరహా నిక్‌నేమ్‌లు యువత పెట్టుకోవడం లేదని గ్రామస్తులు ఒకరు చెప్పారు. గత పదేళ్ల నుంచి నిక్‌నేమ్‌ల సంప్రదాయం ముగిసిందని ఆయన నవ్వుతూ చెప్పారు. కాకపోతే అంతకుముందు వరకు నిక్‌నేమ్‌లు పెట్టుకున్న వారంతా ఇప్పటికీ అదే పేర్లతో గ్రామంలో పిలుచుకుంటున్నారు.

ఈతరం ఒప్పుకోవడం లేదు..



నా పేరు సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ. నేను గెడ్డం బాగా పెంచే వాడిని. అందుచేత నాకు జేడీ (హీరో జేడీ చక్రవర్తి) అనే పేరును మా గ్రామస్తులు పెట్టారు. ఆ పేరే ప్రస్తుతం వాడుకలో ఉంది. మా ముందు తరంతోపాటు మాతరం వరకే ఈ నిక్ నేమ్‌లు పరిమితయ్యాయి. ప్రస్తుత తరం నిక్‌నేమ్‌లకు ఒప్పుకోవడం లేదు. మా గ్రామంలో మాతరం వారికి సుమారు 90 శాతం వరకు మారుపేర్లు ఉన్నాయి. వాటితోనే మేం పిలుచుకుంటాం. ఎవరిని ఎలా పిలిచినా సరదాగానే తీసుకుంటాం.

సంతకానికే నా పేరును వాడతా..



నా పేరు నల్లా రామకృష్ణరావు. మారు పేరు రెడ్డి నాయుడు. నా పదేళ్ల వయస్సులో నాకు రెడ్డినాయుడు అనే పేరును మా బంధువులతోపాటు గ్రామస్తులు పిలిచేవారు. అప్పటినుంచి ఆ పేరే వాడుకలోకి వచ్చింది. నా అసలు పేరును సంతకానికి మాత్రమే వాడతాను. నా అసలు పేరు ఎవ్వరికీ తెలియదు. మా గ్రామంలో సొంత పేరుతో అడ్రస్ కావాలంటే కాస్త ఇబ్బంది పడవల్సిందే. నిక్‌నేమ్, తండ్రి పేరు తెలిస్తేనే అడ్రస్ దొరుకుతుంది.


- పి గన్నవరం (ఆంధ్రజ్యోతి)



పులుల గుట్ట.. దూగుట్ట!

- దూవ్ అంటే గిరిజన భాషలో పులి
- నాడు దూవ్ గుట్ట.. నేడు దూగుట్ట
- పెద్దపులి సంచారంతో మరోసారి చర్చ

కూనవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కూనవరం మండల పరిసర ప్రాంతాల్లో పులుల సంచారంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. కానీ ఈ ప్రాంతానికి పులుల సంచారం కొత్త కాదు. పూర్వం నుంచి పులులు ఈ ప్రాంతంలో సంచరిస్తూనే ఉండేవి. ఊరిలోకి వచ్చి పశువులపై దాడి చేసేవి. కళ్ల ముందే పెంచుకున్న మేకలను ఎత్తుకుపోయేవి. పూర్వం పులులు అన్నీ కలిసి దూవ్ గుట్ట అనే ప్రాంతాన్ని ఆవాస కేంద్రంగా ఏర్పరచుకునేవి అని పెద్దలు చెప్తుండేవారు. దూవ్ అంటే గిరిజన భాషలో పులి అని అర్థం. పులులన్నీ ఆ గుట్ట మీద ఉండేవి కాబట్టి ఆ గుట్టను దూవ్ గుట్ట అనేవాళ్లు. ఆ దూవ్ గుట్ట రానురాను దూగుట్టగా మారిపోయింది. నాలుగురోజుల కిందట మండలంలో అడుగుపెట్టిన పులి కూడా మొదట దూగుట్ట పరిసర ప్రాంతాల్లోకి వచ్చింది. మొదట గ్రామాల దగ్గరల్లోకి వచ్చిన పులి ఇప్పుడు తన రూటు మార్చింది. దట్టమైన అడవుల్లోకి వెళ్తోంది. పులిని కనుక్కోవడం అటవీ శాఖాధికారులకు సవాలుగా మారింది. ఫారెస్టు అధికారులు ఒకవైపు ట్రాప్ కెమెరాలు అమరిస్తే పులి మరోవైపు వెళుతోంది.





పది నాణెం.. చెలా'మనీ!'

- రూ.10 కాయిన్లను తిరస్కరిస్తున్న వ్యాపారులు, జనం
- ప్రధానంగా వ్యాపారులు తీసుకోక పేరుకుపోయిన నిల్వలు
- బ్యాంకులు, అధికారులతో ప్రత్యేక డ్రైవ్
- అధికారుల టార్గెట్‌తో వ్యాపారస్తులకు భారీగా పది కాయిన్లు అప్పగింత
- ఒక్కసారిగా చలామణిలోకి వచ్చిన కాయిన్లు
- కొనుగోలుదారులకు అధికంగా ఈ కాయిన్లే అప్పగిస్తున్న వ్యాపారులు
- పది కాయిన్లు చెల్లుతాయి : కాకినాడ జిల్లా కలెక్టర్

కార్పొరేషన్ (కాకినాడ)/ఆంధ్రజ్యోతి : కొత్త పది రూపాయల కాయిన్స్ అసలు చెల్లుబాటులో ఉన్నాయా.. లేదా.. అన్నది ప్రతీ ఒక్కరి మనసులో ఉన్న ప్రశ్న. ఎందుకంటే రూ.10 కాయిన్స్ ఏ వ్యాపారులూ ఎవరూ తీసుకోవడం లేదు. వినియోగదారులకు ఇచ్చినా వారూ వద్దని చెప్పేస్తున్నారు. ఇది దాదాపు ఏడాదిన్నర నుంచి జరుగుతున్న తంతు. ఆటో ఎక్కి.. దిగిన తర్వాత రూ.10 కాయిన్ ఇస్తే.. ఇది చెల్లదు అని సమాధానం వస్తుంది. ఏ షాపునకు వెళ్లినా.. పెట్రోల్ బంక్ అయినా, ఛాయ్ దుకాణమైనా.. ఇదే ఆన్సర్. కాస్త అవగాహన ఉన్నవారు.. అరె.. రూ.10 కాయిన్స్ వాడుకలోనే ఉన్నాయి అంటే.. 'ఏమో మా దగ్గర ఎవరూ తీసుకోవడంలేదు అందుకే మేము కూడా తీసుకోవడం మానేశాం'.. ఇది ఎదురువారి నుంచి తిరిగి వస్తున్న సమాధానం. సాధారణంగా రిజర్వ్ బ్యాంక్ జారీ చేసే డబ్బులకు మార్కెట్‌లో ఎలాంటి అడ్డంకులు ఉండవు. కానీ పది రూపాయల నాణెం విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. పది రూపాయల నాణెం చెల్లదనే అపోహ ప్రజల్లో చాలా బలంగా ఉంది. వాస్తవానికి ఇది ఎలా మొదలైందో తెలియదు గానీ పది రూపాయల నాణెం చెల్లదనే వాదన జనాల్లో బలంగా నాటుకుపోయింది. ఎలాంటి ఆకృతిలో ఉన్నప్పటికీ పది రూపాయల నాణెం చెల్లుతుందని ఆర్‌బీఐ ఇప్పటికే పలుమార్లు స్పష్టంచేసింది. అందువల్ల పది రూపాయల కాయిన్‌ను నిరాకరించవద్దని స్పష్టమైన ఆదేశాలు సైతం జారీ చేసింది. ఒకవేళ ఈ కాయిన్‌లను నిరాకరిస్తే చట్టప్రకారం, శిక్షార్హులు కూడా అవుతారని ఇప్పటికే పలుమార్లు హెచ్చరించింది అయినా పాతుకుపోయిన అపోహల కారణంగా పది రూపాయల నాణెం ఇస్తే మాత్రం తీసుకోమని చెప్పేస్తున్నారు. నిజానికి కూరగాయల వ్యాపారులు, చిన్నచిన్న హోటళ్లు, కిరాణా, బడ్డీకొట్టు చిరు వ్యాపారులు చిల్లర నాణేల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాగా నలిగిపోయిన పది రూపాయల నోటైనా తీసుకుంటున్నారే తప్ప పది నాణేలను తీసుకోవడానికి ఆసక్తి చూపించడంలేదు. పెట్రోల్ బంకుల్లో వాహనదారులు రూ.10 నాణేలు ఇచ్చి నా సిబ్బంది తిరస్కరిస్తున్నారు. చిన్నవ్యాపారులు అవగాహన లేక నాణేలు తిరస్కరిస్తున్నారంటే వారిలో ఉన్న భయాలకు అర్థం ఉంది. కానీ కేంద్ర పెట్రోలియం సంస్థల ద్వారా నడిచే పెట్రోల్ బంకుల్లో సైతం తిరస్కరించడం విడ్డూరంగా ఉందని ఆశ్చర్యపోతున్నారు.

పలు డిజైన్లలో పది నాణేలు

2009 మార్చి నుంచి 2017 జూన్ మధ్యకాలంలో 14 సార్లు పది రూపాయల నాణేలను ఆర్‌బీఐ విడుదల చేసింది. ఆయా సందర్భాల్ని బట్టి కాయిన్లను పలు డిజైన్‌లో విడుదల చేసింది. మామూలుగా అయితేగా రూ.10 నోట్ల మార్పిడి ఎక్కువగా జరుగుతుంది. నోట్లు చేతులు మారే కొద్దీ త్వరగా పాడవుతుంటాయి. ఈ ఇబ్బందులను అధిగమించేందుకు ఆర్‌బీఐ, మిగతా నాణేలతోపాటు రూ.10 నాణేలను ముద్రిస్తోంది.

కొద్దిరోజులుగా కాయిన్ల చలామణీ

కాయిన్ల చలామణీ ఆగిపోవడంతో బ్యాంకుల్లో అవి గుట్టలు గుట్టలుగా నిల్వ ఉండిపోయాయి. దాంతో ఆర్‌బీఐ కూడా జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. తాజాగా నేరుగా అధికారులు కూడా ఈ కాయిన్ల చలామణీ కోసం అవగాహన కార్యక్రమాలను ప్రారంభించారు. టార్గెట్లు పెట్టి మరీ బ్యాంకుల నుంచి వ్యాపార సంస్థలకు అప్పగిస్తున్నారు. దీంతో ఒక్కసారిగా నాణేలు పెద్ద ఎత్తున మార్కెట్‌ను ముంచెత్తాయి. డీమార్ట్‌కి వెళ్లినా, లేదా మెడికల్ షాపుకెళ్లినా, ఏదైనా నిత్యావసరాల దుకాణానికి వెళ్లినా ఇప్పుడు తిరిగి ఇచ్చే చిల్లరలో కచ్చితంగా రూ.10 కాయిన్లు ఉండేలా చూస్తున్నారు. వద్దని కొనుగోలుదారులు తిరస్కరించినా, అవి చెలామణీలో ఉన్నాయని సమాధానం ఇస్తున్నారు. అయితే తిరిగి తీసుకోవడంలో మాత్రం వ్యాపారులు చొరవ చూపించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. దీనిపై అధికారులు సైతం దృష్టి పెట్టి తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది.



పది నాణెంపై అపోహలు వద్దు..

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 17: పది రూపాయల నాణెంపై ఎలాంటి అపోహలు వద్దని, ఇవి చెల్లుబాటు అవుతాయని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. ప్రజల్లో పది నాణెం చెల్లుబాటుపై ఉన్న అపోహలను తొలగించడంకోసం ఆర్‌బీఐ ఆదేశాల మేరకు యూనియన్ బ్యాంకు నేతృత్వంలో కలెక్టరేట్‌లో పది నాణేలను కలెక్టర్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది నాణేన్ని తిరస్కరించవద్దన్నారు. మేనేజర్లు వెంకట సురేష్ కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.



కాకినాడ వివేకానంద పార్కులోని స్కేటింగ్ రింక్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

నేటి నుంచి కాకినాడలో రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలు

13 జిల్లాల నుంచి 400మంది క్రీడాకారులు హాజరు

కాకినాడ అర్బన్, అక్టోబరు 17: పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో 68వ రాష్ట్ర అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ కాకినాడలో శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. కాకినాడ రాజాట్యాంక్ వైఎస్సార్ స్కేటింగ్ రింక్‌లో పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు స్కూల్‌గేమ్స్ జిల్లా కార్యదర్శి జార్జి తెలిపారు. అండర్-11, 12, 17 విభాగాల్లో జరిగే పోటీలకు 13 జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు హాజరవుతున్నారు. ఈనెల 18 నుంచి 20 వరకు పోటీలు నిర్వహిస్తారన్నారు. ప్రారంభోత్సవానికి కలెక్టర్ షాన్‌మోహన్, డీఈవో పి.రమేష్‌లు పాల్గొంటారని తెలిపారు.



కాకినాడ సమీపంలోని ఉప్పాడ రహదారిలో సముద్రతీర ప్రాంతం వద్ద గురువారం ఆకాశంలో హరివిల్లు కనిపించిన దృశ్యం. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్/కాకినాడ

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 16,449 మంది ఓటర్లు

వచ్చే నెల 6న తుది జాబితా

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 16,449 మంది ఓటుకోసం దరఖాస్తు చేసుకున్నారు. దీనిలో 13,678 మంది ఓటర్లతో ముసాయిదా ఓటర్ల జాబితాను గతంలోనే ప్రచురించారు. ఈనెల 15వ తేదీ వరకు మరో 2771మంది ఉపాధ్యాయులు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవడంతో ఆ సంఖ్య 16,449కి చేరుకుంది. ఈ నేపథ్యంలో 2771 మంది ఉపాధ్యాయుల దరఖాస్తులను ఎన్నికల రిటర్నింగ్ అధికారి పరిశీలించిన తర్వాత ఓటరు జాబితాలో నమోదు చేస్తారు. వచ్చేనెల 6న ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ఓటర్ల తుది జాబితా ఆరు జిల్లాల్లో ప్రచురించి అభ్యంతరాలు స్వీకరిస్తారు.



అండర్-15 జాతీయ చెస్‌కు ఎంపికైన యశస్వి

సర్పవరం జంక్షన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ పి.వెంకటాపురం కేంద్రీయ విద్యాలయానికి చెందిన పదో తరగతి విద్యార్థి సూరాడ యశస్వి సత్యగంగాధర్ అండర్-15 జాతీయ చెస్ పోటీలకు ఎంపికయ్యాడు. గుంటూరులో ఈనెల 15 నుంచి 17దాకా నిర్వహించిన అండర్-15 చెస్ ఓపెన్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచి ప్రథమస్థానంలో నిలిచాడు. దీంతో త్వరలో తమిళనాడులో జరిగే జాతీయస్థాయి అండర్-15 చెస్ ఓపెన్ టోర్నమెంట్‌కు ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికయ్యాడు. ఇటీవల గుజరాత్ అహ్మదాబాద్‌లో నిర్వహించిన 53వ కేంద్రీయ విద్యాలయాల 2024-25 జాతీయస్థాయి చెస్ టోర్నమెంట్‌లో సత్తా చాటి గోల్డ్ మెడల్ సొంతం చేసుకున్నాడు. జాతీయస్థాయి చెస్ టోర్నమెంటకి ఏపీ నుంచి ఎంపికైన సత్య గంగాధర్‌ను కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ బి.శేఖర్ అభినందించారు.

పోటీలకు క్రీడాకారుల ఎంపిక

వేళంగి(కరప), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆటల పోటీలకు వేళంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు క్రీడాకారులు ఎంపికైనట్టు హెచ్‌ఎం జి.భారతి తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో జరిగిన వివిధ అథ్లెటిక్స్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు దుర్గాప్రసాద్, రాంబాబు, వీరమణికంఠ, భగవాన్, అభిరామ్, మనీషా, వీరేంద్ర, ప్రవీణ్ జోష్, వీరదుర్గ, సాయిరితిక, వరలక్ష్మి, లక్ష్మీదీప్తి, సాయిసుధ ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ఈనెల 24 నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో వీరంతా పాల్గొంటారని వివరించారు. ఎంపికైన క్రీడాకారులు, తర్ఫీదునిచ్చిన పీడీ సీహెచ్ కృష్ణలను పలువురు ప్రముఖులు అభినందించారు.

సత్యదేవుడి గిరిప్రదక్షిణ ఏర్పాట్లపై అధికారుల పరిశీలన



గిరిప్రదక్షిణ మార్గంలో ఏర్పాట్లపై పరిశీలన చేస్తున్న అధికారులు

- నవంబరు 15న కార్తీక పౌర్ణమి రోజున గిరిప్రదక్షిణ
- గతంలో పల్లకీ, సత్యరథం ఒకేసారి పయనం

అన్నవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి జరిగే ఉత్సవాల్లో అత్యంత ప్రాధాన్యం కలిగిన గిరిప్రదక్షిణ ఏర్పాట్లకు సంబంధించి అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. ఈ ఏడాది నవంబరు 15న కార్తీక పౌర్ణమి రోజున గిరిప్రదక్షిణ జరగనుంది. దీనిలో భాగంగా గురువారం దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు, ఆలయ అధికారులు గిరిప్రదక్షిణ జరిగే 8.4 కిలోమీటర్లను పరిశీలించారు. భక్తులు అధికంగా పాదరక్షలు లేకుండా ఈ కార్యక్రమంలో పాల్గొనుండడంతో దారిమార్గంలో రాళ్లు, రప్పలు, పిచ్చిమొక్కలు లేకుండా తొలగించడంతోపాటు, అవసరమైన ప్రదేశంలో క్వారీ క్రష్ వేయాలని నిర్ణయించారు. అదేవిధంగా భక్తులకు ఎక్కడెక్కడ పానీయాలు, పళ్లు, మజ్జిగ పంపిణీ స్టాల్స్ ఏర్పాటు చేయాలనే అంశంపై నివేదికను సిద్ధంచేశారు. దీనిని ఈవో దృష్టిలో ఉంచి తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఈ పర్యవేక్షణలో ఈఈ రామకృష్ణ, సహాయ కమిషనర్ రామ్మోహనరావు, ఏఈవో కొండలరావు, సూపరింటెండెంట్ బలువు, సత్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా భక్తుల రద్దీ దృష్ట్యా గతంలో మాదిరిగా కాకుండా స్వల్ప మార్పులు చేపట్టనున్నారు. దీనిలో భాగంగా 15వ తేదీ ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి సత్యదేవుడిని పల్లకీలో గిరిప్రదక్షిణ చేయిస్తారు. మధ్యాహ్నం సత్యరథంపై మరోసారి రత్న, సత్యగిరిలు చుట్టూ ప్రదక్షిణ చేయాలని నిర్ణయించారు. గతంలో సత్యరథం, పల్లకీ ఒకేసారి బయల్దేరగా సుమారు లక్షమంది వరకు వీటి వెంట ప్రదక్షిణ చేసేవారు. గిరిప్రదక్షిణ పూర్తయ్యాక భక్తులు రత్నగిరికి చేరుకుని స్వామిని దర్శించుకునేవారు. దీని వల్ల స్వామివారి దర్శనాలు, వ్రతాలు చేసుకునే భక్తులు, గిరిప్రదక్షిణ పూర్తయిన భక్తులు ఒకేసారి స్వామిదర్శనానికి విచ్చేస్తుండడంతో దర్శనంకోసం గంటలకొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. నూతన విధానం వల్ల కొందరు భక్తులు పల్లకీ వెంట, కొందరు సత్యరథం వెంట గిరి ప్రదక్షిణలో పాల్గొంటారని భావిస్తున్నారు.





పాపన్న విగ్రహం వద్ద కూర్చున్న మహిళలు.. తాడిపర్రులో ఇరువర్గాలను శాంతింపజేస్తున్న అధికారులు

సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహం వద్ద వివాదం

- తాడిపర్రులో ఉద్రిక్తత
- విగ్రహం ముసుగు తొలగింపు
- రెండు సామాజిక వర్గాల మధ్య వివాదం
- శాంతింపజేసిన అధికారులు

నిడదవోలు (ఉండ్రాజవరం), అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం మండలం తాడిపర్రు గ్రామంలో సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహం ముసుగు తొలగింపుతో రెండు సామాజిక వర్గాల మధ్య గురువారం ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే తాడిపర్రులో సుమారు రెండేళ్ల కిందట గౌడ సామాజిక వర్గీయులు గ్రామంలోని అజ్జరం రోడ్డులో సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే అప్పుడు ఈ విగ్రహం ఏర్పాటును కాపు సామాజిక వర్గం వ్యతిరేకించడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. అప్పటి నుంచి గ్రామంలో 144 సెక్షన్ అమలులో ఉంది. ఈ నేపథ్యంలో విజయదశమి ఉత్సవాల ముగింపు సందర్భంగా గ్రామంలో అమ్మవారి ఊరేగింపులో చెలరేగిన ఘర్షణలో కోపోద్రిక్తులైన గౌడ వర్గానికి చెందిన మహిళలు బుధవారం పాపన్న గౌడ్ విగ్రహానికి ఉన్న ముసుగును తొలగించినట్టు సమాచారం. అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటనతో అధికారులు అప్రమత్తమై 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేశారు. ఇరువర్గాల మధ్య ఉద్రిక్త వాతావరణం ఏర్పడడంతో గ్రామంలో పీస్ కమిటీని ఏర్పాటు చేశారు. విగ్రహం వద్ద పెట్రోలు సీసాలు చేతపట్టి మహిళలు చేస్తున్న నిరసనను ఆర్డీవో రాణి సుస్మిత శాంతింపజేశారు. ఇరువర్గాలతో దఫదఫాలుగా చర్చలు జరిపారు. 144 సెక్షన్ అమలులో ఉండగా విగ్రహం ముసుగును తొలగించడం నేరమని చెప్పారు. సుదీర్ఘ మంతనాల అనంతరం పాపన్నగౌడ్ విగ్రహం చుట్టూ గుడ్డను కట్టి సమస్యను పరిష్కరించారు. సుమారు 18 నెలలుగా ఈ వివాదం కొనసాగుతోంది. ఎట్టకేలకు గురువారం రాత్రికి సమస్యను అధికారులు ఒక కొలిక్కి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వివివి రామారావు, ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు వివిధ శాఖల సిబ్బంది ఉన్నారు.

సత్యదేవుడి సాక్షిగా ఒక్కటైన 150 జంటలు

అన్నవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో గురువారం నూత న దంపతులతో సందడి నెలకుంది. బుధవారం రాత్రి 8.30, 12.30 ముహూర్తాలలో దేవస్థానంలో సత్యదేవుడి సాక్షిగా 150 జంటలు ఒక్కటయ్యాయి. వీరితోపాటుగా వివిధ ప్రాంతాలలో వివాహం చేసుకున్న జంటలు స్వామివారి వ్రతమాచరించుకున్నారు. వీరికి ఇబ్బందులు కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. సుమారు 500 కొత్తజంటలు వివిధ సమయాలలో సత్యదేవుడి వ్రతమాచరించుకున్నారు. గురువారం ఒక్కరోజు వివిధ విభాగాల ద్వారా స్వామివారికి రూ.40 లక్షలు ఆదాయం లభించింది.


సత్యదేవుడి వ్రతాలాచరిస్తున్న నూతన దంపతులు

వినాయక సదన్‌కు రూ.3లక్షలు విరాళం

అయినవిల్లి, అక్టోబరు 17ఆంధ్రజ్యోతి): అయినవిల్లిలో వినాయక సదన్‌లో ఒక వసతి గది ఆధునీకీకరణకు గురువారం అయినవిల్లికి చెందిన మద్దింశెట్టి బ్రహ్మయ్య కుమార్తె నల్లం లక్ష్మీనరసయమ్మ, భర్త బాలకృష్ణారావు పేరున వారి సంతానం రూ.3లక్షలు విరాళం అందజేశారు. వీరికి ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించి శ్రీస్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి దాతను అభినందించారు.


దాతకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న దృశ్యం

భక్తుడికి దేవస్థానం కాంట్రాక్టు ఉద్యోగి టోకరా

● నకిలీ గదుల రసీదుతో మోసం

అన్నవరం, అక్టోబరు 17: అన్నవరం దేవస్థానంలో ఒక కాంట్రాక్టు ఉద్యోగి నకిలీ గదుల బుకింగ్ రసీదుతో టోకరా వేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే ఒక పెండ్లి బృందానికి బుధవారం జూన్ నెల 26న బుకింగ్ చేసుకున్న హరిహరసదన్ సత్రంగది రిజర్వేషన్ గది రసీదును ఎడిట్‌చేసి అక్టోబరు 16న బుకింగ్ చేసినట్లు పెళ్లిబృందానికి సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయ గుమస్తా సంతకాన్ని ఫోర్జరీ చేసి అందివ్వడంతో పెళ్లి బృందం ఆ రసీదుతో సత్రం వద్దకు వెళ్లగా స్కాన్ కాకపోవడంతో పెళ్లిబృందం అవాక్కయ్యారు. దీంతో వారు ఈవో కార్యాలయంలో ఫిర్యాదుచేయగా దళారీని పట్టుకుని స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలని ఈవో సూచించారు. పెళ్లి బృందం ఇబ్బందిపడకుండా కరెంటు బుకింగ్ ద్వారా అద్దెతీసుకుని సత్రం గది కేటాయించారు. దీనిపై కంప్యూటర్ వ్యవహారాలు చూసే ఉద్యోగి రమేష్ ఇది హ్యాక్ చేయడంకాదని ఏరోజు బుకింగ్‌కు ఆరోజు స్కాన్ చేస్తేనే సిస్టమ్ తీసుకుని గది కేటాయిస్తారన్నారు.

అండర్ - 14 బాలురు, బాలికల ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫుట్‌బాల్ గ్రౌండ్స్‌లో గురువారం ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా అండర్ 14 బాలురు, బాలికల జట్టు ఎంపికలు జరిగాయి. 90మంది బాలురు, 40 మంది బాలికలు హాజరయ్యారు. డీవైఈవో నారాయణరావు, ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి స్వామి, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ గౌరవ కార్యదర్శి సుంకర నాగేంద్ర కిషోర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రమణమూర్తి, జిల్లా వ్యాయామ సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఏవీడీ ప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.

దిగిరాని వంట నూనెల ధరలు

● బహిరంగ మార్కెట్లో సన్‌ఫ్లవర్ ప్యాకెట్ రూ.140, పామాయిల్ రూ.125
● మొక్కుబడిగా తగ్గింపు ధరల ప్రత్యేక కౌంటర్లు
● ఎస్‌వీ మార్కెట్, రైతు బజార్ ప్రత్యేక కౌంటర్లకు ఆదరణ శూన్యం



రాజమహేంద్రవరంఅర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్లో వంటనూనెల ధరలునేలకు దిగిరావడంలేదు. ఆయిల్ దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం 27.5శాతం మేర కస్టమ్స్ డ్యూటీ విధించడంతో ఆయిల్ ధరలు ఒక్కసారిగా భగ్గుమన్న సంగతి తెలిసిందే. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ధరల నియంత్రణ చర్యలకు పూనుకున్నా ఆశించిన ప్రయోజనం అందడంలేదు. వారం రోజుల క్రితం ఒకటి, రెండుచోట్ల సన్‌ఫ్లవర్, పామాయిల్ తగ్గింపు ధరల ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినా పెద్దగా ప్రయోజనం లేదనే అభిప్రాయం జనాల్లో వ్యక్తమవుతోంది. నేటికీ సెమీ హోల్‌సేల్, మధ్యస్త, చిన్న కిరాణా షాపుల్లోని ఆయిల్ ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు సతమతమవుతున్నారు. రిటైల్ బహిరంగ మార్కెట్లో 910 గ్రాముల సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్ ధర రూ.136 నుంచి రూ.140లకు విక్రయిస్తుంటే, 850 గ్రాముల పామాయిల్ ప్యాకెట్ రూ.125ల ధర ఉంది. ఆయిల్ ధరలను నియంత్రించడానికి జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టినా అవి ప్రజలకు ఏ మాత్రం ఉపశమనం కల్గించడంలేదు. ధరలను నియంత్రించడం కోసం ఇటీవల ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఎస్‌వీ హోల్‌సేల్ మార్కెట్, కంబాలచెరువు సమీపంలోని నటరాజ్ రైతు బజార్‌లో తగ్గింపు ధరల కౌంటర్లు ప్రారంభించారు. సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు, అధికారులు ఎంతో అట్టహాసంగా వీటిని ప్రారంభించారు. ఈ ప్రత్యేక కౌంటర్లలో 910 గ్రాముల సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.124లకు, 840 గ్రాముల పామాయిల్ రూ.110లకు విక్రయిస్తున్నారు. తెల్లరేషన్‌కార్డుదారులకు నెలకు మూడు పామాయిల్ ప్యాకెట్లు, ఒక సన్‌ఫ్లవర్ ఆయిల్ విక్రయిస్తున్నారు. ఈ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినా రిటైల్ మార్కెట్లో దీని ప్రభావం ఏ మాత్రం లేదనే చెప్పాలి. ధరల మోత మోగుతూనే ఉంది.

నామమాత్రంగా విక్రయాలు

ఎస్‌వీ హోల్‌సేల్ మార్కెట్, నటరాజ్ రైతుబజార్ వద్ద ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్లలో సన్‌ఫ్లవర్, పామాయిల్ విక్రయాలు నామమాత్రంగా జరుగుతున్నాయి. పెద్దగా స్పందన కనిపంచడంలేదు. ఎస్‌వీ హోల్‌సేల్ మార్కెట్ ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఊరికి దూరంగా ఉన్నట్టు ఉంటుంది. ఇక్కడే ఎక్కువ మంది హోల్‌సేల్ ఆయిల్ డీలర్లు ఉన్నారు. దీంతో ఆయా హోల్‌సేల్ షాపుల్లోనే తగ్గింపు ధరల ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. కానీ, ఈ హోల్‌సేల్ మార్కెట్ సామాన్య, మధ్యతరగతి ప్రజానీకానికి చాలా దూరంగా ఉండడం ప్రజలకు భారంగా మారింది. రైల్వేస్టేషన్ ఏరియా, కంబాలచెరువు, కోటిలింగాలపేట, స్టేడియంఏరియా, క్వారీమార్కెట్ ఏరియా, లాలాచెరువు వంటి ప్రాంతాల్లో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎక్కువమంది ఉంటారు. వీళ్లు అంత దూరం వెళ్లి నూనెలు కొనాలంటే వ్యయప్రయాసలు పడాల్సి ఉంటుంది. దీంతో ఆయిల్ ధరలు భారమైనా వీరంతా స్థానికంగా ఉండే కిరాణా షాపులను ఆశ్రయించాల్సి వస్తోంది. నటరాజ్ రైతు బజార్‌లోని కౌంటర్‌లోనూ నామమాత్రంగానే ఆయిల్ విక్రయాలు జరుగుతున్నాయి. కౌంటర్ ప్రారంభం రోజున పామాయిల్ ఒక బాక్సు సన్‌ఫ్లవర్ ఒక బాక్సు తీసుకొచ్చారు. ఒక్కో బాక్సులో 16 ప్యాకెట్లు ఉంటాయి. పామాయిల్ ప్యాకెట్లు అమ్ముడుపోగా, సన్‌ఫ్లవర్ ప్యాకెట్లు నేటికీ ఇక్కడ విక్రయిస్తున్నారు. మెయిన్‌రోడ్డు, జాంపేటలోనూ ఒక్కో కౌంటరు ఏర్పాటు చేసినట్టు చెబుతున్నా అవి ఎక్కడున్నాయనేదానిపై ప్రజలకు సమాచారం లేదు. అన్ని రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తే ధరలు కొంతలో కొంతైనా అదుపులోకి వస్తాయని ప్రజలు భావిస్తున్నారు.



ప్రభుత్వ ప్రత్యేక కౌంటర్లలో ధరలు

తగ్గింపు ధరలకు విక్రయాలపై వ్యాపారుల్లో నిరాసక్తత

ఇదిలావుంటే తగ్గింపు ధరలకు పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ విక్రయాలపై హోల్‌సేల్ వ్యాపారుల్లో తీవ్ర నిరాసక్తత కనిపిస్తోంది. ఇన్‌వాయిస్ కంటే తక్కువ ధరలకు విక్రయించాల్సి రావడమే దీనికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటువిషయంలో అధికారులు తమను బలవంతంగా ఒప్పించారనే భావన ఆయిల్ వ్యాపారుల్లో వ్యక్తమవుతోంది. ఇన్‌వాయిస్ ధరల కంటే తక్కువ ధరకు ఆయిల్ విక్రయించడంవల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని, ఒక్కో పామాయిల్ ప్యాకెట్‌పై రూ.9 నుంచి రూ.10లు, సన్‌ఫ్లవర్ ప్యాకెట్‌పై రూ.5 నుంచి రూ.6లు నష్టపోతున్నామని వ్యాపారులు చెబుతున్నారు. ఇలా నష్టం ఎంతకాలం భరించి విక్రయించగలమని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయిల్ ఇంపోర్టర్స్ (దిగుమతిదారులు) ఇన్‌వాయిస్‌లో ధరలు తగ్గిస్తే ఆమేరకు తాము ఎలాంటి లాభం ఆశించకుండా ప్రజలకు విక్రయించగలమని, ఇన్‌వాయిస్ కంటే తక్కువ ధరకు అమ్మాలంటే భారంగానే ఉందని హోల్‌సేల్ వ్యాపారి ఒకరు వాపోయారు.

లిక్విడ్ గంజాయి స్వాధీనం

● అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు

మోతుగూడెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మల్కాన్ గిరిజిల్లా దిసరిగూడ గ్రామం నుంచి భద్రాచలానికి అక్ర మంగా గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని మోతుగూడెం ఎస్‌ఐ కె.శివకుమార్, సిబ్బంది గురువారం అరెస్టు చేశారు. జీకే వీధి మండలానికి చెందిన పాంగి సంతోష్ దిసరిగూడ నుంచి రెండు కిలోల లిక్విడ్ గంజాయిని భద్రాచలానికి తరలిస్తున్నాడు. పొల్లూరు గ్రామ శివారున గల దారాలమ్మ ఆలయంవద్ద సంతోష్‌ను పోలీసులు పట్టుకున్నారు. దీని విలువ రూ.1లక్షలు ఉంటుందని ఎస్‌ఐ శివనారాయణ తెలిపారు. అతడి మొబైల్ సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో ఏఎస్‌ఐ రాజేశ్వరరావు, హెచ్‌సీ రవిచంద్ర, పీసీఎస్ నిబంధనరావు, ఎస్‌ఆర్‌కె రాజు, ఏఆర్ సిబ్బంది ఉన్నారు.

గండేపల్లిలో 14.5 కిలోల గంజాయి పట్టివేత


గంజాయి పట్టుకున్న పోలీసులు

గండేపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గండేపల్లి గ్రామ శివారున జాతీయరహదారి మీదుగా అక్రమంగా తరలిస్తున్న గంజాయిని గురువారం గండేపల్లి పోలీసులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు గండేపల్లి ఎస్‌ఐ యువి శివనాగబాబు తనిఖీలు చేయగా మోటారు సైకిల్‌పై ఇద్దరు వ్యక్తులు గంజాయి తరలిస్తుండడాన్ని గుర్తించారు. దీనిపై వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 14.5 కేజీల గంజాయి, మోటారుసైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. గంజాయి విలువ రూ.72,500 ఉంటుందన్నారు. పల్నాడు జిల్లాకు చెందిన కేతవత్ స్వామినాయక్, మామిళ్లపల్లి బాలగణేష్‌ను గండేపల్లి డిప్యూటీ తహసీల్దార్ దివ్య భారతి సమక్షంలో అరెస్టు చేశామన్నారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఎస్‌ఐ శివనాగబాబును అభినందించారు.

చోరీపై కేసు నమోదు

గండేపల్లి, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): బంగారం, నగదు చోరీపై కేసు నమోదు చేసినట్లు గండేపల్లి పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలో బొర్రంపాలెం గ్రామానికి చెందిన మంగిన వీర వెంకటేశ్వరరావు తన కుటుంబంతో హైదరాబాద్‌లో ఉపాధి నిమిత్తం ఉంటున్నాడని అయితే అతని సొంత ఇల్లు బొర్రంపాలెంలో ఉంది. వెంకటేశ్వరరావు హైదరాబాద్ నుంచి ఈనెల మొదటివారంలో వచ్చి దివ్యాంగ పెన్షన్ తీసుకుని హైదరాబాద్ వెళ్లినట్లు తెలిపారు. గురువారం వెంకటేశ్వరరావు ఇంటి తలుపుల తాళాలు పగలకొట్టి ఉండటంచూసి చుట్టుప్రక్కల వారు ఈ విషయాన్ని వెంకటేశ్వరరావుకు తెలిపారు. మల్లిపల్లిలో ఉంటున్న అతని మరదలు వరలక్ష్మి వచ్చి ఇంట్లో చూడగా బీరువాలో దాచుకున్న సుమారు లక్షరూపాయల విలువ చేసే బంగారు వస్తువులు, రూ.20వేలు నగదు దొంగలించారని గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్‌ఐ యూవీ శివనాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జనన మరణాల్లో ఒక్కటిగానే...

హైదరాబాదులో రసాయనాల ట్యాంకులో పడి దొంతికుర్రు కవలలు మృతి

కాట్రేనికోన, అక్టోబరు(ఆంధ్రజ్యోతి): తల్లి గర్భం నుంచి నిమిషాల వ్యవధిలో ఈ భూమిపైకి వచ్చారు. 32 ఏళ్ల తర్వాత నిమిషాల వ్యవధిలోనే ఈ భూమిని వదిలి మృత్యుఒడిలోకి చేరుకున్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం దొంతికుర్రుకు చెందిన కవలల వీడని బంధం. దొంతికుర్రుకు చెందిన వస్కా సత్యనారాయణ, సీతమ్మలకు నలుగురు కుమారులు. ఇద్దరి తర్వాత కవలలు జన్మించారు. ఉపాధి కోసం కవల సోదరులు రామ్, లక్ష్మణ్(32) హైదరాబాద్ వెళ్లారు. గుండ్లపోచంపల్లిలో ఉంటూ కూలిపనులు చేసుకుని పొట్ట పోసుకుంటున్నారు. ఈనెల 16న జీడిమెట్ల పారిశ్రామికవాడలోని మూతపడిన సాబూరి ఫార్మా ప్రైవేటు సంస్థలో ఫ్యాబ్రికేషన్ పనులకు వెళ్లారు. ఒక షెడ్‌కు ఉన్న పైప్‌లను తొలగిస్తుండగా రామ్ అదుపు తప్పి కింద ఉన్న రసాయనాల ట్యాంకులో పడిపోయాడు. రామ్ ఉక్కిరిబిక్కిరి అవుతుండగా అతడిని కాపాడేందుకు వెంటనే లక్ష్మణ్ ఆ సంపులోకి దిగాడు. స్పృహ కోల్పోయిన రామ్‌ను బయటకు తీసిన లక్ష్మణ్ సైతం నోట్లో నుంచి నురగలు కక్కుకుంటూ పడిపోయాడు. వీరిద్దరినీ ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. అప్పటికే రామ్, లక్ష్మణ్‌లు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. పుట్టుకలోను, మృత్యువులోను వీడని ఈ అన్నదమ్ముల అనుబంధాన్ని గ్రామస్తులు గొప్పగా చెప్పుకుంటున్నారు. దొంతికుర్రులో రామ్, లక్ష్మణ్‌ల మృతితో విషాదం నెలకొంది. పదేళ్ల క్రితం ఉపాధి కోసం కలిసి వెళ్లిన సోదరులు కలిసే ఈ లోకాన్ని వీడటాన్ని కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు.


రామ్, లక్ష్మణ్(ఫైల్)

జొన్నాడలో 40కాసుల బంగారు ఆభరణాల చోరీ

ఆలమూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడలో ఇంటి తలుపులు పగులగొట్టి ఇంట్లోని 40కాసుల బంగారు ఆభరణాలను దొంగిలించారు. ఈమేరకు ఆలమూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు వివరాలు ఇలా ఉన్నాయి. జొన్నాడకు చెందిన చిటికెన సోమరాజు తన భార్య అనారోగ్య కారణంగా ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లారు. ఎప్పటిలాగే పనిమనిషి ఇంటిని శుభ్రం చేయడానికి రావడంతో తలుపులు పగులగొట్టి ఉన్నాయి. దీంతో ఆత్రేయపురం గ్రామానికి చెందిన జానా మారుతిశివరామ్ ఇచ్చిన ఫిర్యాదులో ఇంట్లో 40 కాసుల బంగారు ఆభరణాలు దొంగిలించినట్లు పేర్కొన్నారు. ఈమేరకు రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్‌ఐ ఎం.అశోక్, క్లూస్ టీం ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయిని తరలిస్తున్న తమిళనాడు ముఠా అరెస్టు

విజయవాడ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : కాకినాడ జిల్లా తుని నుంచి తమిళనాడుకు గంజాయిని తరలిస్తున్న ఇద్దరు నిందితులను పటమట పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 145 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారి వద్ద ఉన్న నాటు తుపాకీని సీజ్ చేశారు. తమిళనాడులోని చెన్నై పద్మనాభనగర్‌కు చెందిన రమేష్ వినేష్‌కుమార్, రాణిపర్తి జిల్లా మేళకుప్పం ప్రాంతానికి చెందిన కుమారన్ మరిమూర్తి స్నేహితులు. వారు చెన్నై నుంచి బుధవారం ఉదయం బయలుదేరి తునికి చేరుకున్నారు. విశాఖపట్నం నుంచి వచ్చిన ముఠా వారికి తుని వద్ద గంజాయిని అంద జేసింది. ఈ సరుకును చెన్నైకి తీసుకెళ్లి విక్రయించా లనుకున్నారు. దీనికి వారం రోజులు ముందుగా వారు ఇదే స్కెచ్‌ను అమలు చేశారు. తుని నుంచి గంజాయిని తీసుకెళ్లి చెన్నైలో విక్రయించారు. విశాఖ ముఠా నుంచి రెండు కిలోల గంజాయిని రూ.9 వేలకు కొనుగోలు చేశారు. దాన్ని చెన్నైలో రూ.20 వేలకు విక్రయిం చారు. వారం రోజుల క్రితం వేసిన స్కెచ్ ఫలించ డంతో వారు బుధవారం ఉదయం అక్కడి నుంచి తునికి వచ్చారు. అక్కడ నుంచి గంజాయిని కారులో తరలిస్తుండగా సమాచారం రావడంతో పటమట పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు రామవర ప్పాడు రింగ్ వద్ద గురువారం తనిఖీలు నిర్వహిం చారు. వినేష్, కుమారన్ వద్ద గంజాయిని గుర్తిం చారు. వాహనాన్ని తనిఖీ చేస్తుండగా వారి వద్ద నాటు తుపాకీ ఉంది. దీనితోపాటు 145 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు ప్రస్తుతం వారిని విచారిస్తున్నారు. బిహార్‌లో ఈ తుపాకీనికి కొనుగోలు చేసినట్టు వినేష్ అంగీ కరించాడు. వినేష్ స్వగ్రామంలో వడ్డీ వ్యా పారం చేసేవాడు. అప్పటికే ఈ వ్యాపారంలో ఉన్నవారు వినేష్‌ను అడ్డుకున్నారు. వారి నుంచి రక్షించుకో వడానికి ఈతుపాకీని కొనుగోలు చేశానని వినేష్ పోలీసులకు వివరించినట్టు తెలిసింది.

గుండెపోటుతో తూర్పు డీపీవో మృతి

● గ్యాస్ నొప్పి అనుకుని ప్రభుత్వ ఆసుపత్రికి
● తెల్లవారుజామున ప్రైవేటు ఆసుపత్రికి తరలింపు
● ఉదయం 6 గంటలకు మృతి

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లా పంచాయతీ అధికారి బి.శ్రీనివాసరావు(58) గురువారం ఉదయం గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందారు. బుధవారంరాత్రి 11గంటల సమయంలో గ్యాస్ నొప్పిగా ఉందని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు.ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో డెల్టా ఆసుపత్రికి తరలించారు. ఒక స్టంట్ పూడుకుపోవడంతో ఉదయం 6గంటలకు మృతిచెందినట్టు ఆసుపత్రి యాజమాన్యం కుటుంబీకులకు చెప్పారు. దీంతో కుటుంబీకులు ఆసుపత్రి యాజమాన్యంతో కాసేపు వాగ్వాదానికి దిగారు. మరో రెండు స్టంట్‌లు ఉండడంతో ఒకటి పూడుకుపోయిన వైద్యం అందిస్తే బతికే వారని బోరుమన్నారు. వైద్య సక్రమంగా అందకపోవడంతోనే మృతిచెందిన ఆరోపించారు. గతంలో రెండుసార్లు గుండెపోటు వచ్చింది. మూడు స్టంట్‌లు పడ్డాయి. విశాఖపట్నంలో సమగ్ర శిక్ష అడిషనల్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తూ ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లాకు వచ్చారు. సెప్టెంబరు 30వ తేదీన జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఆగస్టు నెలలో ఒక కుమార్తెకు రాజమహేంద్రవరం రూరల్ ఎంపీడీవో శ్రీని వాస్ కుమా రుడికి ఇచ్చి వివా హం జరిపిం చారు. ఈ నేప థ్యంలో ఆయన జిల్లాకు డీపీవోగా వచ్చినట్టు సమాచారం. ఆయన ఇద్దరు కుమార్తెలు డెంటి స్టులుగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన రాజమహేం ద్రవరం హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉంటున్నారు. గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా పలు శాఖల్లో విధులు నిర్వహించారు.డీపీవో భౌతికకా యాన్ని వైజాగ్‌కు తరలించారు.


డీపీవో మృతిపై సంతాపం తెలుపుతున్న కలెక్టర్, జేసీ తదితరులు

డీపీవో శ్రీనివాసరావు

డీపీవో మృతి బాధాకరం : కలెక్టర్

జిల్లా పంచాయతీ అధికారి మృతి ఎంతో బాధాకరమని జిల్లా కలెక్టర్ ప్రశాంతి అన్నారు. డెల్టా ఆసుపత్రికి కలెక్టర్ వెళ్లి శ్రీనివాసరావు పార్థివ దేహానికి పూలమాలలువేసి నివాళులర్పించి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.అనంతరం కలెక్టరేట్ సమావేశమందిరంలో శ్రీనివాసరావు మృతికి సంతాపం తెలిపారు. నిబద్ధత కలిగిన అధికారిగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించ డం ఉన్నతాధికారుల ఆదేశాలను అనుసరించి పనులు చేపట్టేందుకు ఎపుడూ ముందుండేవారన్నారు.జేసీ చిన్నరాముడు, డీఆర్‌వో జి.నరసింహులు,ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, డీసీవో శ్రీరాములు, సీపీవో అప్పలకొండ, పలువురు జిల్లా అధికారులు 2 నిమషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.

వైద్య రంగంలో ఫిజియో థెరపీ కీలకం

●మెడికల్ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ డాక్టర్ రఘునందన్

రాజానగరం, అక్టోబరు 17: వైద్య రంగంలో ఫిజియో థెరపీ కీలకపాత్ర పోషిస్తుందని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్(అకాడమిక్), డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్, మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ డాక్టర్ జి.రఘునందన్ అన్నారు. జీఎస్‌ఎల్ ఫిజియో థెరపీ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో రాజానగరంలోని జీఎస్‌ఎల్ మెడికల్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన కాన్వొకేషన్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి, వైద్య విద్యార్థులకు పలు సూచనలు, సలహా లు అందించారు. యువ వైద్యులు వైద్య వృత్తిలో రోగులకు మెరుగైన సేవలందిస్తూ జీవితంలో ఉన్న త శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. మరో ముఖ్యఅతిథి జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ మాట్లాడుతూ ఫిజియోథెరపీ.. ఉపశమనంతోపాటు రోగులకు మనోధైర్యాన్ని ఇస్తుందన్నారు. తమ వద్దకు వచ్చే రోగు లమెడికల్ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ డాక్టర్ రఘునందన్‌కు సేవాదృక్పథంతో సేవలందించాలని సూచించారు. మరో ముఖ్యఅతిథి, సినీనటుడు, ఎర్గోనామిక్, కార్పొరేట్ /వెల్‌నెస్ ట్రైనర్, యోగా అండ్ స్ట్రెస్ థెరపిస్ట్ డాక్టర్ భద్రం మాట్లాడుతూ రోగులకు సేవలందించడంలో ఏవిధమైన పక్షపాతం లేకుండా దయాగుణంతో మెలగా లని యువ వైద్యులకు సూచించారు. అనంతరం ఫిజియోథెరపీ వైద్య విద్యనభ్యసించిన యువ వైద్యులకు పట్టాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో భాగంగా తొలుత ముఖ్యఅతిథులను జీఎస్‌ఎల్ యాజమాన్యం ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేసింది. కార్యక్ర మంలో జీఎస్‌ఎల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ చీఫ్ పాట్రాన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ఛైర్‌పర్సన్ డాక్ట ర్ గన్ని కాసింబి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గన్ని సందీప్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గన్ని సాధిక, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ గురునాథ్, సూపరింటెండెంట్ టీవీఎస్‌పీ మూర్తి, స్వంతంత్ర మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ మెడికల్ సూప రింటెండెంట్ డాక్టర్ ఎన్.వేణుగోపాల్, జీఎస్‌ఎల్ ట్రస్టు డైరెక్టర్ డాక్టర్ తరుణ్, వైద్య విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ఎస్పీ నరసింహ కిషోర్‌ను సత్కరిస్తున్న యాజమాన్యం

కలవచర్లలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు

● అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి
● వాహనాలను స్వాధీనం చేసుకున్న అధికారులు

రాజానగరం, అక్టోబరు 17: రాజానగరం మండలం కలవచర్ల పోలవరం కాలువగట్టుపై అక్రమంగా గ్రావెల్, మట్టి తవ్వకాలు సాగిస్తున్న లారీలు, యంత్రాన్ని రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా బుధవారం అర్ధరాత్రి దాడిచేసి పట్టుకున్నారు. సంబంధిత అధికారు లు, పోలీసులతో ఫోన్‌లో మాట్లాడి సంఘటనా స్థలానికి రప్పించి వాహనాలను అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రెండు నెలలుగా గుట్టుచప్పుడు కాకుండా అధికార పార్టీ అండదండలలో అక్రమంగా పోలవరం సాయిల్ బ్యాంకుకు సంబంధి ంచిన గ్రావెల్, మట్టి తరలిస్తున్నారన్నారు. నియోజక వర్గంలో ఎక్కడచూసినా అవినీతి, అక్రమాలు తప్ప అభివృద్ధి కానరావడం లేదన్నారు. అధికార పార్టీ కనుస న్నల్లోనే ఈ అక్రమ దందా జరుగుతోందని ఆరోపించారు. కలెక్టర్, మైనింగ్ శాఖాధికారులు తక్షణమే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈవిషయమై సమగ్ర విచారణ జరిపించాలని విజిలెన్స్ అధికారులకు, పోలవరం ప్రాజెక్టు అధికారులకు కూడా ఫిర్యాదు చేస్తానని రాజా పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు జక్కంపూడి గణేష్, అడబాల చిన బాబు, ప్రగడ చక్రి, దాట్ల రఘు, ఎర్ని ప్రసాద్, సుంకర శ్రీను తదితరులున్నారు.


కలవచర్లలో సంఘటనా స్థలంలో అధికా రులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

గ్రామాల్లో పండుగ వాతావరణం

అంతర్వేది, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ సందర్భంగా పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా సఖినేటిపల్లి, సఖినేటిపల్లిలంక, రామేశ్వరం, మోరి, మోరిపోడులలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ గురువారం పర్యటించారు. గ్రామాల్లో సీసీ రోడ్లకు భూమిపూజ చేయడంతో పండుగవాతావరణంనెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో రాబోయే రోజుల్లో వేసే సీసీ రోడ్లతో మరింత అందంగా కనిపిస్తాయన్నారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, గుబ్బల ఫణికుమార్, ముప్పర్తి నాని, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, రుద్రరాజు పద్మరాజు, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్‌లు రేపూరి రాజేశ్వరి ఏసు నరసింహరాజు, ముప్పర్తి అలివేలు గంగాత్రివేణి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి విద్యా వైభవ్ ఒలింపియాడ్ పోటీలు

పోటీపడ్డ 26 పీఎంశ్రీ పాఠశాలల విద్యార్థులు

ప్రథమ స్థానం సాధించిన పి.గన్నవరం జడ్పీహెచ్ఎస్

అమలాపురం టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జిల్లాస్థాయి విద్యావైభవ్ ఒలింపియాడ్ పోటీలు నిర్వహించినట్లు జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.కమలకుమారి తెలిపారు. అమలాపురం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో గురువారం ఈపోటీలను నిర్వహించారు. జిల్లాలోని 26పీఎంశ్రీ పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. పాఠశాల హెచ్ఎం వి.విజయకుమారి అధ్యక్షతన జరిగినకార్యక్రమంలో సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారిలో పోటీ తత్వాన్ని పెంపొందించేలా ఈ పోటీలను నిర్వహించామన్నారు. ప్రోగ్రాం నోడల్ అధికారి పి.రాంబాబు మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు జిల్లాస్థాయి పోటీలను నాలుగు కేటగిరీల్లో నిర్వహించామన్నారు. బహుమతి ప్రదానోత్సవ సభలో ఉపవిద్యాశాఖాధికారి జి.సూర్యప్రకాశరావు, సమగ్రశిక్షా ఏఎంవో పి.రాంబాబు, సీఎంవో టీవీవీ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం చేతులమీదుగా డీఈవోతో కలసి సర్టిఫికెట్లు అందజేశారు. హెచ్ఎం సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నిమ్మకాయల గణేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి కోసమే పల్లె పండుగ


సీసీ రహదారుల శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

కాట్రేనికోన, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పల్లెపండుగ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధికి రూ.13.50కోట్లను ప్రభుత్వ కేటాయించిందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పల్లెపండుగ వారోత్సవాలు మండలంలో గురువారం కన్నుల పండుగగా జరిగాయి. చెయ్యేరు, పెనుమల్లె, ఉప్పూడి, కుండలేశ్వరం, కాట్రేనికోన, నడవపల్లి, గెద్దనపల్లి, కొప్పిగుంట, దొంతికుర్రు, పల్లంకుర్రు గ్రామాల్లోకార్యక్రమాలు జరిగాయి. 11గ్రామాల్లోని48ప్రాంతాల్లో రూ.2.82 కోట్లతో సీసీ రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. చెయ్యేరులో రూ.28లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన సీసీ రహదారులనుఎమ్మెల్యే ప్రారంభించారు. నాగిడి నాగేశ్వరరావు, పొద్దోకు బాలు, సర్పంచ్‌లు చెల్లి సురేష్, వంక ఏడుకొండలు, రంబాల రమేష్, గోకరకొండ వీర వెంకటగౌరీసుబ్బలక్ష్మి, గంటి సుధాకర్, గెద్దాడి ఈశ్వరి, దంతులూరి సీతారామకృష్ణంరాజు, కముజు వెంకటలక్ష్మి, నాతి అలివేలు, గుత్తుల సూర్యమహాలక్ష్మిశ్రీనివాస్, నాయకులు సూదా బాబూరావు, మంతెన శ్రీనురాజు,నంద్యాల వెంకటేశ్వరరావు, టీవీవీ నారాయణస్వామి, నామా వెర్రిబాబు, రంబాల చౌదరిబాబుపాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కార్యాచరణ

మామిడికుదురు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో గ్రామాలను అభివృద్ధి చేస్తుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాల కార్యక్రమం మండలంలోని పలు గ్రామాల్లో గురువారం జరిగింది. మొగలికుదురులో రూ.16లక్షలు, నగరంలో రూ.20లక్షలు, పెదపట్నంలో రూ.16లక్షలు, టూటుకుర్రులో రూ.15లక్షలు, మాకనపాలెంలో రూ.20లక్షలు, ఆదుర్రు రూ.20లక్షలు, పెదపట్నంలంక రూ.20లక్షలు, పాశర్లపూడి రూ.20లక్షలు, అప్పనపల్లి రూ.20లక్షలు, పెదపట్నంలంక రూ.15, బి.దొడ్డవరంలో రూ.18లక్షలతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనచేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజా, మెండా ఆదినారాయణ, సర్పంచ్‌లు జాలెం రమణకుమారి, కడి అరుణకుమారి, గుబ్బల దుర్గ, బళ్ల శ్రీనివాసరావు, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, సుందరనీడి రాజేష్‌కుమార్, అడబాల తాతాకాపు, గెడ్డం మంగాలక్ష్మి పాల్గొన్నారు.

శుద్ధమైన మంచినీరు అందించడమే ధ్యేయం

మలికిపురం/అంతర్వేది, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో ప్రజలందరికీ శుద్ధమైన తాగునీరు అందించాలనేదే నా కల అని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మోరిలో జరిగిన పల్లె పండుగ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రూ.1650కోట్లతో ఒక ప్రాజెక్టును ధవళేశ్వరం గోదావరి నుంచి రాజోలు ప్రాంతానికి అమలు చేస్తే జిల్లాకు చివరన ఉన్న ఈప్రాంత ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించవచ్చుననేది నా ఆలోచన అని ఆయన అన్నారు. ఇప్పటికే గుడిమెళ్లంక ప్రాజెక్టులో ఓఎన్జీసీ సహకారంతో రూ.5కోట్లతో ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రస్తుతం మొదటి విడతగా రూ.11.30 కోట్లతో రోడ్లు వేస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, ముప్పర్తి నాని, ఎంపీపీ వీరామల్లిబాబు, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, గుబ్బల ఫణి, సర్పంచ్ పసలపూడి పద్మమంగతాయారు, ఎంపీటీసీ జాన సూర్యావతి, కడలి వెంకటరత్నం, పేరాబత్తుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గృహాల మధ్య మద్యం దుకాణాలు వద్దని ఆందోళన

మామిడికుదురు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పాశర్లపూడి బొమ్మిడిపాలెంలో నివాసగృహాల చెంతన ఏర్పాటుచేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలంటూ స్థానికులు గురువారం ఆందోళన చేపట్టారు. దీనిపై పంచాయతీ, తహశీల్దార్, ఎక్సైజ్ కార్యాలయాలు, నగరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు. వెంటనే నివాస గృహాలు చెంతనే ఏర్పాటుచేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలంటు డిమాండ్ చేశారు. మామిడిశెట్టి మధు, ఎం.విజయలక్ష్మి, పి.నరసమ్మ, యు.రాజు, గెడ్డం గణపతిరావు, బి.సావిత్రి, యు.ఏడుకొండలు, బి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన వ్యాన్.. డ్రైవర్ మృతి

ముమ్మిడివరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఐషర్ వ్యాను అదుపు తప్పి మురుగునీటి బోదెలోకి దూసుకువెళ్లడంతో డ్రైవరు మృతిచెందాడు. అనాతవరం వడ్డివారిపేటకు చెందిన బీర శ్రీనివాసరావు(39) గురువారం కొబ్బరికాయల లోడుతో భీమనపల్లి వైపు వెళుతుండగా అనాతవరం-భీమనపల్లి రోడ్డులో దంగేటివారిపాలెం సమీపంలో వ్యాను అదుపు తప్పి మురుగుకాల్వలోకి దూసుకెళ్లింది. దీంతో శ్రీనివాసరావు వ్యానులో ఇరుక్కుని మృతిచెందాడు. అతడికి భార్య పద్మావతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

అమలాపురం రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బండారులంకలో డంపింగ్‌యార్డు లేకపోవడంతో చెత్తను ఎక్కడ వేయాలో తెలియక పది రోజులుగా ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోయిందని సర్పంచ్ పెనుమాల సునీత ఆధ్వర్యంలో ఆ ప్రాంత ప్రజలు గురువారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. బండారులంక శివాలయం వీధి ప్రాంత ప్రజలు కలెక్టరేట్‌కు చేరుకుని నిరసన తెలిపారు. ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోయి కుళ్లిపోతుందని, దీనివల్ల ప్రజారోగ్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్‌కు అర్జీ అందించారు.

'రాయల్ క్లబ్ పిటిషన్ కొట్టివేసిన సుప్రీం కోర్టు'

యానాం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): యానాంలోరిక్రియేషన్ పేరుతో గ్యాంబ్లింగ్ నిర్వహణ అనుమతి కోరుతూ యానాం రాయల్ క్లబ్ సుప్రీం కోర్టులో దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను న్యాయమూర్తులు కొట్టివేశారని పుదుచ్చేరి ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. రాయల్ క్లబ్ కేసుకు సంబంధించి మద్రాస్ హైకోర్టు వివిధ శాఖలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను సుప్రీం కోర్టు రికార్డుల నుంచి తొలగించిందన్నారు. ఈతీర్పు నేపథ్యంలో యానాంలో మళ్లీ ఎలాంటి క్లబ్బులు రాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఆయాచితంగా సొమ్ములు సంపాదించాలని భావించే కొందరికి సుప్రీం కోర్టు తీర్పు చెంప పెట్టులాంటిదన్నారు. క్లబ్ శాశ్వతంగా మూతపడేందుకు సహకరించిన ముఖ్యమంత్రి, అధికారులకు మల్లాడి కృతజ్ఞతలు తెలిపారు.

సాయిబాబా మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

మలికిపురం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ సీఎన్ సాయిబాబా మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేడంగి చిట్టిబాబు అన్నారు. గురువారం పూలే- అంబేడ్కర్ భవనలో సాయిబాబా సంతాప సభ చైతన్యసమితి ప్రధాన కార్యదర్శి మంథా సత్యనారాయణ అధ్యక్షతన వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగింది. సాయిబాబా చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మానవహక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేడిద రాజేష్ మాట్లాడారు. కోవిడ్ సమయంలో సాయిబాబా పట్ల రాజ్యాంగ వ్యవస్థలు కఠినంగా వ్యవహరించాయన్నారు. బహుజన సమాజ్‌పార్టీ రాష్ట్ర నాయకుడు బత్తుల లక్ష్మణరావు, మానవహక్కులవేదిక జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మహ్మద్‌ఇక్బాల్, ముత్యాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ ఉద్యోగుల ఆందోళన

యానాం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజాపనుల శాఖలో పనిచేస్తోన్న సిబ్బంది ఆందోళన చేపట్టారు. కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. దీపావళికి ముందే బోనస్, జీతాలు ఇవ్వాలని కోరారు. అనుమతులు లేకుండా ధర్నా నిర్వహించడంతో భారీగా పోలీసులు మోహరించారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రత్యేక కృషి

మామిడికుదురు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రత్యేక కృషి చేస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశం నగరం గ్రామంలో గురువారం జరిగింది. గ్రామగ్రామాన కమిటీలువేసి పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేలా ప్రత్యేక కార్యాచరణ చేస్తున్నట్టు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, నాయకులు మహ్మద్ అరిఫ్, మాచవరపు శివన్నారాయణ, నాగవరపు నాగరాజు, నేతల నాగరాజు, కొండేటి వెంకటేశ్వరరావు, అప్పన శ్రీరామకృష్ణ, గెడ్డం వెంకటేశ్వరరావు, వానరాశి దుర్గారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉప్పలగుప్తం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): చెట్ల కొమ్మలు నరికివేత, నిర్వహణ పనుల నిమిత్తం ఉప్పలగుప్తం, చల్లపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ఈఈ ఎం.రవికుమార్, ఏఈ శ్రీహరి తెలిపారు. మండలంలోని అన్నిగ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

మామిడికుదురు: ట్రీ కటింగ్ నిమిత్తం శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ ఎం.రవికుమార్ తెలిపారు. తాటిపాక సెంటర్, మొగలికుదురు, వేగివారిపాలెం, గెద్దాడ, కడలి గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

అమలాపురం టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో పిచ్చికుక్క స్వైర విహారం చేసి 15మందిని గాయపరిచింది. గురువారం అమలాపురం బస్టాండు సెంటర్ సమీపంలో పిచ్చికుక్క దాడిచేసి మహిళను తీవ్రంగా గాయపరిచింది. అక్కడి నుంచి దుడ్డువారి అగ్రహారం తదితర ప్రాంతాల్లో స్వైర విహారం చేయడంతో 15మంది గాయపడ్డారు. పలువురు అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

మండపేట

డ్రైనేజీ శాఖ నిర్లక్ష్యం వీడి కౌశిక డ్రైన్లు శుద్ధీకరించండి

మండల పరిషత్ సమావేశంలో సమస్యల మొర

కొత్తపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ శాఖ అలసత్వాన్ని వీడి పలు గ్రామాలకు ఇబ్బందిగా ఉన్న కౌశిక డ్రెయిన్లను శుద్ధీకరించాలని కొత్తపేట మేజర్ పంచాయతీ సర్పంచ్ బూసి జయలక్ష్మి కోరారు. గురువారం కొత్తపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మార్గన గంగాధర్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా సర్పంచ్ బూసి జయలక్ష్మి మాట్లాడుతూ కౌశిక డ్రెయిన్ కారణంగా కొత్తపేట శివారు ప్రాంతాల వాసులు దుర్వాసనతో, దోమలతో, అంటురోగాలతో ఇబ్బందులు పడుతున్నారని, ఐదేళ్లలో డ్రెయిన్‌ను తూడు, గుర్రపుడెక్క, మురుగునీరు పెరిగిపోయి దోమల వ్యాప్తి చెందినా పట్టించుకోలేదని వాపోయారు. దీనిపై సంబంధిత ఏఈ మాట్లాడుతూ గతంలోరూ.30లక్షల ప్రతిపాదనతో తొలగింపు పనులకు నిధులు మంజూరైనా కాంట్రాక్టర్ వెనక్కితగ్గాడని ఇప్పుడు రూ.70లక్షలతో కౌశిక డ్రెయిన్ శుద్ధీకరణకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు.ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పైపులైన్ నిర్మాణం పేరుతో రోడ్లను తవ్వి పనులు పూర్తయ్యాక తాత్కాలికంగా మూసివేశారని, శాశ్వతంగా పనులు చేయకపోవడం వల్ల వర్షానికి పైపలైన్ వెళ్లిన మార్గంలో గోతులు ఏర్పడి రోడ్లు ఛిద్రమయ్యాయని దీనిపై చర్యలు తీసుకోవాలనికోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పద్మ మాట్లాడుతూ ఈసమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి మరమ్మతులు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పలుశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.జడ్పీటీసీ గుడపాటి రమాదేవి, ఎంపీడీవో పీఎస్‌నరేష్‌కుమార్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లుపాల్గొన్నారు.



కొత్తపేట మండల పరిషత్ సమావేశం

మహర్షి వాల్మీకి జయంతి

కొత్తపేట, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): కొత్తపేట విశ్వకవివేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి ప్రిన్సిపాల్‌కేపీరాజునివాళులర్పించారు. వైస్‌ప్రిన్సిపాల్ టి.రమాదేవి, అధ్యాపకులు కె.సత్యనారాయణ, అంకమరావు, కేఎస్ఎన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

వద్దిపర్రు సొసైటీకి తాళాలువేసిన రైతులు

స్పెషల్ ఆఫీసర్ మినిట్స్ బుక్ ఇంటికి తీసుకువెళ్లడంపై అభ్యంతరం



ఆత్రేయపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వద్దిపర్రు సోమేశ్వర ప్రాథమిక సహకార పరపతి సంఘంలో స్పెషల్ ఆఫీసర్ మినిట్స్ పుస్తకాలు ఇంటికి తీసుకువెళ్లి తీర్మానాలు మార్చివేశారనే అంశంపై సంఘ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సొసైటీ సర్వసభ్య సమావేశం స్పెషల్ ఆఫీసర్ మాధవరావు, ఆడిటర్ రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. సంఘ పరిధిలోని సభ్యులు హాజరై పలు అంశాలపై చర్చించారు. మినిట్స్ బుక్‌లో రైతుల సంతకాలు తీసుకుని స్పెషల్ ఆఫీసర్ మాధవరావు మినిట్ పుస్తకాన్ని ఇంటికి తీసుకుని వెళ్లిన వైనంపై రైతులకు అనుమానాలు వ్యక్తమయ్యాయి. సంఘ సభ్యులు చేపట్టిన అంశాలనే కాకుండా సొంత ఎజెండాతో కొన్ని అంశాలను మినిట్స్ బుక్‌లో పొందు పరిచారనే ఆరోపణలపై రైతులు సొసైటీ కార్యాలయాన్ని చుట్టుముట్టి బ్యాంకుకు తాళం వేశారు. ఈవిషయం తెలుసుకున్న స్పెషల్ ఆఫీసర్, ఆడిటర్, సొసైటీ కార్యాలయానికి చేరడంతో రైతులు తాళాలు తీశారు. ఒకానొక దశలో రైతులు వారిపై మండిపడ్డారు. సత్వరమే మినిట్స్‌లో అంశాలను రద్దుచేసి మరలా సర్వసభ్య సమావేశం నిర్వహించాలని రైతులు పట్టుబట్టారు. అలాగే మినిట్ పుస్తకాలను ఇంటికి తీసుకువెళ్లిన అంశంపై విషయాన్ని ఒప్పుకుని రాత పూర్వకంగా తెలియచేయాలని కోరడంతో స్పెషల్ ఆఫీసర్ అంగీకరించి లెటర్ ఇచ్చారు. ఈవిషయాన్ని రెండు గ్రామాల సంఘ రైతులు, జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిపారు.



వద్దిపర్రు సొసైటీలో స్పెషల్ ఆఫీసర్‌ను నిలదీస్తున్న రైతులు

వెల్లలో ఉచిత మెగా పశువైద్యశిబిరం

ద్రాక్షారామ,అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): వెల్లలో మండపేట రాష్ట్ర పశుసంవర్ధకశాఖ శిక్షణాకేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా పశువైద్య శిబిరం నిర్వహించారు. 124 పాడిపశువులకు పశువైద్యులు డాక్టర్ వి.జి.ఎస్.ప్రసాద్, డాక్టర్ పి.రామచంద్రరావు, డా.ఎం.కృష్ణార్జున, డా.ఎం.బిందు వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా పశసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టరు డా.బి.నాగేశ్వరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఓ.రామకృష్ణ ఆధ్వర్యంలో రూ.20వేలు విలువైన గర్భకోశ మందులు, మినరల్ మిక్చర్, కాల్షియం, హార్మోన్ ఇంజక్షన్లు పంపిణీచేశారు. మండపేట శిక్షణా కేంద్రంసంయుక్త సంచాలకులు ఆర్.వెంకటేశ్వర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పల్లె పండుగతో గ్రామాలకు మహర్దశ



ఆలమూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న పల్లెపండుగతో గ్రామాలకు మహర్దశ పట్టిందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఐదేళ్ల కాలంలో అభివృద్ధికి ఆమడ దూరంగా ఉండిపోయిన గ్రామాలు పల్లెపండుగతో అభివృద్ధి వైపు పయనిస్తున్నాయన్నారు. మూలస్థానంలో రూ.37లక్షలు, బడుగువానిలంకలో రూ.30లక్షలు, చిలకపాలపాడులో రూ.20లక్షలు, చెముడులంకలో రూ.20లక్షలు, చొప్పెల్లలో రూ.30లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు ఎమ్మెల్యే బండారు గురువారం శంకుస్థాపన చేశారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, ఎంపీడీవో కె.జాన్‌లింకన్, ఈవోపీఆర్డీ ఎ.రాజు, సర్పంచ్‌లు లంక వరప్రసాద్, దూలం వెంకటలక్ష్మి, ఉండ్రాసపు మౌనిక, తమ్మన శ్రీనివాస్, దంగేటి చంద్రకళ, నాయకులు మెర్ల గోపాలస్వామి, దొండపాటి సుబ్బరాజు, నాగిరెడ్డి వెంకటరత్నం, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, సూరపురెడ్డి సత్య, ఈదల సత్తిబాబు, వంటిపల్లి పాపారావు, ఈదల నల్లబాబు, వంటిపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హసన్‌బాదలో ఉపాధి హామీ గ్రామసభ

ద్రాక్షారామ, ఆంధ్రజ్యోతి, అక్టోబరు 17: హసన్‌బాదలో గురువారం ఉపాధి హామీ పథకం గ్రామసభ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో గ్రామంలో చేపట్టాల్సిన పనులు గుర్తించి పనులు ఆమోదిస్తూ తీర్మానం చేశారు. ఇన్‌చార్జి ఏపీవో ఈశ్వర్, ఫీల్డ్‌అసిస్టెంట్ వజ్రపు ఆనందబాబు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ 17వ వార్షికోత్సవం

కె.గంగవరం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): పాణింగపల్లి సాయిబాబా ఆలయ 17వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు బాబాకు అభిషేకాలు, భజనలు చేశారు. గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త నెక్కంటి శ్రీనివాస్, నాగప్రసూన దంపతులు కుటుంబ సమేతంగా బాబాను దర్శించుకుని పూజలు చేశారు. ఈసందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని, తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

అనుమతుల్లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

కె.గంగవరం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని గ్రామాల్లో అనుమతులు లేకుండా బాణసంచా విక్రయాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని పామర్రు ఎస్ఐ ఎస్.కె.జానీబాషా హెచ్చరించారు. అనుమతులు లేకుండా బాణసంచా సామగ్రిని కొని ఇళ్ల వద్ద తయారుచేయడం నేరమన్నారు.అనుమతులు తీసుకుని, ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించి మాత్రమే విక్రయాలు నిర్వహించాలని సూచించారు.

జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు

పి.గన్నవరం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): అమలాపురం బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లాలోని పీఎంశ్రీ పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పి.గన్నవరం హైస్కూల్ పదో తరగతి విద్యార్థులు లంకే అజేయుడు, శృంగవరపు బిందులు మొదటిస్థానం సాధించినట్లు హెచ్ఎం డి.ఎస్.వి.ప్రసాద్ తెలిపారు. విద్యార్థులు డీఈవో కమలకుమారి, ఏపీసీ సుబ్రహ్మణ్యం నుంచి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

వరద బాధితులకు రూ.4.25లక్షల విరాళం




రాయవరం, అక్టోబరు 17 (ఆంధ్ర జ్యోతి): విజయవాడ వరద బాధితుల కోసం రాయవరం సాయి తేజ విద్యానికేతన్ స్కూల్ విద్యార్థులు రూ.4.25లక్షలు విరాళాలు సేకరించారు. ఉండవల్లిలో ఐటీ మంత్రి లోకేశ్‌కు చెక్కును స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు గురువారం అందజేశారు. విద్యార్థులను, స్కూల్ యాజమాన్యాన్ని లోకేశ్ అభినందించారు.

రేపు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

రాయవరం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): లొల్ల గ్రామంలోని మానవతా ఆశ్రమం 33వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 19న విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, 108 సూర్యనమస్కారాల పోటీలు నిర్వహిస్తున్నట్టు వ్యవస్థాపకుడు అల్లూరి శ్రీనివాస్‌చౌదరి తెలిపారు. లొల్ల, పరిసర గ్రామాల పాఠశాలల విద్యార్థులు ఈపోటీల్లో పాల్గొనవచ్చన్నారు.

పంపన అర్జునరావు కన్నుమూత



ద్రాక్షారామ, ఆంధ్రజ్యోతి, అక్టోబరు 17: రామచంద్రపురం నియోజకవర్గంలో 2004లో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన విద్యావేత్త, పారిశ్రామిక వేత్త పంపన అర్జునరావు గురువారం తెల్లవారుజామున 4గంటలకు అనారోగ్యంతో చికిత్స పొందుతూ బెంగళూరులో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆయన స్వస్థలం రామచంద్రపురం మండలం బాపనయ్య చెరువు. వ్యాపారరీత్యా గాజువాకలో స్థిరపడ్డారు. ఏవీకే కళాశాల వ్యవస్థాపకుడు, గాయత్రి ఫ్యాబ్రికేషన్స్, లక్ష్మీ ప్రభ ఇండస్ట్రీ వ్యవస్థాపకుడిగాఉన్నారు. 2004ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రామచంద్రపురం నుంచి పోటీ చేశారు.

ఇసుక ర్యాంపులను పరిశీలించిన ఆర్డీవో

కపిలేశ్వరపురం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): కోరుమిల్లి, కపిలేశ్వరపురం, నారాయణలంక, కేదార్లంక, తాతపూడి గ్రామాల్లోని ఇసుక రీచ్‌లను రామచంద్రపురం ఆర్డీవో ఖతీబ్ కౌసూర్ భానో గురువారం పరిశీలించారు. గతంలో ర్యాంపుల నిర్వహణ తీరు, వాటి పరిస్థితులు తదితర అంశాలను స్థానిక అధికారులను అడిగితెలుసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో అందుబాటులో ఉండే ఇసుక రీచ్‌లను త్వరలో తెరిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. తహసీల్దార్ చిన్నారావు, హెడ్‌వర్క్స్ ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, మైన్స్ ఏఈలు, ఎస్ఐ రవికుమార్, వీఆర్‌వోలుపాల్గొన్నారు.

జొన్నాడ అభివృద్ధి కోసం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతి

ఆలమూరు, అక్టోబరు 17:(ఆంధ్రజ్యోతి): జొన్నాడలో వివిధ అభివృద్ధి పనులకు కేంద్ర నిధులు కేటాయించాలని కోరుతూ గ్రామానికి చెందిన వ్యాపారవేత్త గొడవర్తి సత్యనారాయణ వినతిపత్రం అందించారు. హైదరాబాద్‌లో కిషన్‌రెడ్డి నివాసంలో కలసి జొన్నాడ గ్రామంలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులు గురించి చర్చించారు. పూర్తి సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు సత్యనారాయణ తెలిపారు.

కేబుల్ ఆపరేటర్ల సమావేశం

రావులపాలెం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలోని చిర్ల జగ్గిరెడ్డి కల్యాణ మండపంలో రాష్ట్ర మల్టీసర్వీసెస్ కేబుల్ సంక్షేమ సంఘ సమావేశం జరిగింది. సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొన్నారు. సమస్యలను పరిష్కారించాలంటూ కేబుల్ ఆపరేటర్లు వినతిపత్రాన్ని అందచేసి ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో గుత్తుల పట్టాభిరామారావు, కాసా సాగర్, కంఠంశెట్టి శ్రీనివాస్, గుబ్బల మూర్తి, కముజు శ్రీను పాల్గొన్నారు.